క్లుప్తంగా

విశాలాక్షినగర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం ఎస్సీ, ఎస్టీ కాలనీలో కొత్తగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు ఆధ్వర్యంలో సోమవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ స్వాతి ఆవిష్కరించారు. పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దేశ ప్రజలకు ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, తూర్పు నియోజకవర్గం ఎస్సీ విభాగం ఇన్‌చార్జి గూడపాటి విక్టర్, విగ్రహ నిర్వాహక కమిటీ సభ్యులు సురేష్, తారక్, భాస్కర్, నాగరాజు, శ్రీను, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా హనుమంతవాక కూడలి



విద్యుత్ కాంతులతో హనుమంతవాక కూడలి

ఆరిలోవ: హనుమంతవాక కూడలి ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. ఐదు లైన్‌ల బీఆర్‌టీఎస్ రోడ్లు, జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఈ కూడలి విద్యుత్ కాంతులతో వెలుగులు విరజిమ్ముతోంది. జీవీఎంసీ అధికారులు ఇటీవల నగరంలో కూడళ్లను ఆధునికీకరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో హనుమంతవాక కూడలితో పాటు విశాలాక్షినగర్, డెయిరీఫారం, పెదగదిలి, ఉషోదయా, ఎంవీపీ కాలనీ కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. వాటిని వివిధ ఆకారాలలో తయారు చేశారు. హనుమంతవాక పేరును ఆంగ్ల అక్షరాలతో ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అమర్చారు. అవి రాత్రి వేళ కనులు మిరుమిట్లు గొలిపేటట్లు వెలుగుతూ జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రోడ్లపై ప్రయాణించే వారిని ఆకట్టుకుంటోంది. దీంతో పాటు చుట్టూ పచ్చదనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇందిరమ్మ అభయ హస్తంపై విస్తృత ప్రచారం



ఆరిలోవలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ: ఇందిరమ్మ అభయహస్తం కార్యక్రమం, యాప్‌లపై ఆరిలోవలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంపా గోవిందరాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాలు పట్టుకొని నాయకులు 11వ వార్డు బాలాజీనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నెలా పేద కుటుంబానికి రూ.5,000 ఇస్తామంటూ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.లక్ష్మి, గుత్తుల శ్రీనివాస్, బాషా, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ విశాఖ జిల్లా మహిళ విభాగం నాయకురాలు మాకెన లక్ష్మీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయం, సెక్టార్–9 ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరతాయన్నారు.

జూలో కూల్.. కూల్‌గా..



పక్షుల గూళ్లను నీటితో తడుపుతున్న యానిమల్ కీపరు



జూలో ఎలుగుబంట్లు, కోతుల ఎన్‌క్లోజర్ల వద్ద సిద్ధం చేసిన పందిరి

- వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం సన్నాహాలు
- ఎన్‌క్లోజర్ల వద్ద తాటి కమ్మలతో పందిళ్ల ఏర్పాటు

ఆరిలోవ: వేసవి తాపం నుంచి వన్యప్రాణులను కాపాడేందుకు ఇందిరాగాంధీ జూ పార్కులో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా వేసవి కాలంలో జూలో వన్యప్రాణులతో పాటు సందర్శకులకు చల్లదనం కోసం ఏర్పాట్లు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా జూ అధికారులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సుమారు 800కు పైగా వన్యప్రాణులున్నాయి. ఏనుగులు, పెద్ద పులులు, సింహాలు, జింకలు, కణుజులు, ఎలుగుబంట్లు, నీటి ఏనుగులు, మొసళ్లు, పాములు, నక్కలు, ఆస్ట్రేలియా, ఆఫ్రికన్ ప్యారెట్లు, ఆస్ట్రిచ్‌లు, జిరాఫీ, జీబ్రా తదితర వన్యప్రాణులు జూకు వచ్చిన సందర్శకులను అలరిస్తున్నాయి. వేసవి వేడిని తట్టుకోవడానికి వీటికి కూల్ రూఫ్‌లు వేయడం, కమ్మల పాకలు నిర్మించడం చేస్తున్నారు. వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చుతుండడంతో వారం రోజులుగా అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. కోతులు, ఎలుగుబంట్లు ఎన్‌క్లోజర్లలో పాకలు వేస్తున్నారు. వాటి నైట్‌క్రాల్స్‌పై వైట్‌వాష్ వేస్తున్నారు. పక్షుల జోన్‌లలో వేర్లతో తయారు చేసిన చాపలు వేస్తున్నారు. నెమళ్లు, వివిధ రకాల పక్షుల గూళ్లను రోజులో మూడు, నాలుగు సార్లు నీటితో తడుపుతున్నారు. సందర్శకులు సేద దీరడానికి పలు చోట్ల గడ్డితో షెడ్‌లు నిర్మిస్తున్నారు. వాటిలో వెదురుతో తయారు చేసిన బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకుల కోసం ఇప్పటికే పలుచోట్ల ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. కొద్ది రోజుల్లో అన్ని ఎన్‌క్లోజర్లలోను అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు జూ అధికారులు తెలిపారు.

ప్రజారంజక పాలనకు ఆకర్షితులై..

- ఎంపీ ఎంవీవీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



పార్టీలో చేరిన జాలరిపేట వాసులు

ఎంవీపీ కాలనీ: విశాఖ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి ముంగిట నిలిపే బాధ్యత తనదని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డు జాలరిపేటకు చెందిన 2 వేల మందికి పైగా మత్స్యకారులు సోమవారం రాత్రి జరిగిన కార్యాక్రమంలో ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంవీవీ వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు వెల్లడించారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం సర్వముఖాభివృద్ధి బాధ్యత తనదన్నారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో 19వ వార్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గన్నమనేని వెంకటేశ్వరరావు, మొల్లి అప్పారావు, కెల్ల సత్యనారాయణ, గేదెల నాగరాజు, సూరాడ దాసు, సూరాడ వెంకటలక్ష్మి, ఉమ్మిడి దాసు, పల్లా దుర్గారావు, కృపాజ్యోతి పాల్గొన్నారు.

పీర్రాజు ఇంట్లో ఎంవీవీ సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న ఎంవీవీ తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సోమవారం 19వ వార్డు జాలరిపేటను సందర్శించారు. గడపగడపకు వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలించాలని, తూర్పు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. అనంతరం రామోలు పీర్రాజు, పైడమ్మల ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీ సహపంక్తి భోజనం చేశారు.

ప్రగతికి బాటలు వేసుకోవాలి

- తల్లిదండ్రులే ఆరాధనీయులు
- నైపుణ్యాలు నిరంతరం పెంచుకోవాలి
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అవధులు లేని ప్రగతికి బాటలు వేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న రీబూట్ 2కె24 సదస్సుని ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నైపుణ్యాలు, సామర్థ్యాలను యువత నిత్యం పెంపొందించుకోవాలని సూచించారు. మంచి ఉద్యోగం, మెరుగైన ప్యాకేజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి విశాఖ ఆలోచనలు, లక్ష్యాలతో ముందడుగు వేయాలన్నారు. చదువుతో పాటు సహపాఠ్య కార్యక్రమాలకు తగిన సమయం, ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రానున్న ఏడాది కాలానికి మనం ప్రణాళికను ఇప్పుడు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేటి తరం యువత సినిమా నటులను ఆరాధిస్తారని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. తల్లిదండ్రులే ఆరాధనీయులని, ఆదర్శనీయులని గుర్తించుకోవాలని హితవు పలికారు. ఉపాధి రంగంలో తీవ్రమైన పోటీతత్వం ఉందని, యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి మాట్లాడుతూ తమ కళాశాలలో 90 శాతం మందికిపైగా విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించారన్నారు. సీనియర్స్ జూనియర్ విద్యార్థులతో స్నేహ పూర్వకంగా ఉంటూ తగిన మార్గదర్శకం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో ఫ్లాగ్ మార్చ్



చినగదిలిలో ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్న పోలీసులు

ఆరిలోవ: త్వరలో జగరనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆరిలోవ పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బీఆర్‌టీఎస్ రోడ్డులో చినగదిలి వద్ద నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్ హుషారుగా సాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సజావుగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



ఆరిలోవ ఎస్‌బీఐ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఎన్నికల బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును ఎస్‌బీఐ అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన వివరాలను చెప్పాల్సిన అవసరం లేదని ఇటీవల ప్రధానమంత్రి మోదీ ప్రకటించడం మంచి విధానం కాదన్నారు. ఎన్నికైన ప్రజాప్రతిధులను కొనుగోలు చేయడానికి ఈ బాండ్లను వినియోగించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఆరిలోవ జోన్ కార్యదర్శి నరేంద్ర కుమార్, సభ్యులు పి.శంకరరావు, ఎస్.రంగమ్మ, కె.సత్యనారాయణ, డి.నాగరాజు, లక్ష్మి, అరుణ, అప్పారావు పాల్గొన్నారు.

అచ్చుతాపురం నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర



జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న మహేశ్వరరావు

బీచ్‌రోడ్డు: అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు అచ్చుతపురానికి చెందిన యువకుడు సైకిల్‌పై బయలుదేరారు. పైలా మణిందర్ చేపట్టిన అచ్చుతాపురం టు అయోధ్య సైకిల్ యాత్రను సోమవారం బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్ వద్ద నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఉద్యోగాల భర్తీకి వినతి



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు



బొత్స ఝాన్సీకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

బీచ్ రోడ్డు: నిరుద్యోగ యువత కోసం మరో లక్ష ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు. ఈ మేరకు సోమవారం సిరిపురంలోని మంత్రి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఏయూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స ఝాన్సీని కలిసి నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు.

కాలుష్య రహిత విశాఖకు సహకరించండి



ఆర్టీసీ బస్సు దిగి కార్యాలయానికి కాలి నడకన వెళ్తున్న మేయర్

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖలో కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

కారు డ్రైవర్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

ఆరిలోవ: జీవీఎంసీ 8వ వార్డ్ ఎండాడ ప్రాంతంలో కారు డ్రైవర్ మృతిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఎంవీపీ కాలనీకి చెందిన మోసగంటి సుబ్రహ్మణ్యం(42) ఎండాడ సెయింట్ లూక్స్ కళాశాల సమీపంలో ఆదివారం ఉదయం కాలిపోయి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనపై ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఆరిలోవ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైన వివరాలను బట్టి సుబ్రహ్మణ్యం మృతి ఆత్మహత్య, హత్యా అనేది నిర్ధారణ అవుతుందని, దాన్ని బట్టి దర్యాప్తు మరింత వేగవంతం చేయనున్నట్టు ఆరిలోవ పోలీసులు తెలిపారు.

రూ.1.53 కోట్లతో శివాజీ పార్కు అభివృద్ధి

- అదనపు సౌకర్యాల కల్పన
- ప్రారంభించిన మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: శివాజీ పార్కులో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సోమవారం ప్రారంభోత్సవం చేశారు. జీవీఎంసీ రూ.1.53 కోట్లతో ఈ నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వాటర్ ఫౌంటెన్లు, విద్యుత్ వెలుగులు, ఫ్రంట్ ఎలివేషన్, సుందరీకరణ, టాయిలెట్స్, వాకింగ్ ట్రాక్స్ ఇలా ఎన్నో సౌకర్యాలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ నగర ప్రజలు ఇష్టపడే పార్కుల్లో శివాజీ పార్కు ఒకటన్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పార్కులో పెద్ద ఎత్తున సౌకర్యాలను పునరుద్ధరించామన్నారు. ఈ సౌకర్యాలను నగర వాసులు కుటుంబ సభ్యులతో కలిసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గేదెల లావణ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, సుబ్రహ్మణ్యం, ప్రేమ్, జోషిలా, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

నాక్‌లో అత్యుత్తమ స్థానం గర్వకారణం



నాక్ స్కోర్ పోస్టర్‌తో రాహుల్ రాఘవేంద్ర తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నాక్ గ్రేడింగ్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానం సాధించడం గర్వకారణమని ఇన్ఫినిటెం మీడియా సీఈవో, ఏయూ పూర్వ విద్యార్థి రాహుల్ రాఘవేంద్ర అన్నారు. సోమవారం ఆయన ఏయూను సందర్శించి, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ నాక్ ఏ డబుల్ ప్లస్ తో 3.74 సీజీపీఏ సాధించడం ఎంతో కష్టతరమైన విషయమన్నారు. దీనిని ఏయూ సాధించి జాతీయ స్థాయిలో తన సత్తాను చాటిందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఏయూలో ఐటీడీఎస్ కేంద్రం



వీసీ ప్రసాదరెడ్డితో ఐటీడీఎస్ అధికారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ స్టడీస్(ఐటీడీఎస్) కేంద్రం ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను ఐటీడీఎస్ చైర్మన్ కాట వెంకటరెడ్డి ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని కలిసి వివరించారు. ఆదివాసి అభివృద్ధి అధ్యయనాల సంస్థ ఏయూ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం హర్షనీయమని వీసీ అన్నారు. కేంద్రం ఏర్పాటుకు అర్థశాస్త్ర విభాగంలో అవసరమైన ప్రాంగణం కల్పిస్తామన్నారు. ఏయూ చూపిన చొరవకు ఐటీడీఎస్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ మేనేజర్ చిక్కాల రిషీంద్ర రావు, కోశాధికారి శంకర్, కార్యదర్శి వి.మల్లికార్జున్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ఆచార్యుడు సందర్శన



ఆచార్య జ్ఞాన భాస్కర్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన ఆచార్య జ్ఞాన భాస్కర్ సందర్శించారు. గణిత శాస్త్ర విభాగం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఉన్నత విద్య, ఉపాధిలో అవకాశాలను వివరించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాన భాస్కర్‌ని వర్సిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.అనూరాధ కామేశ్వరి, ఆచార్య పి.డి.ఎన్.శ్రీనివాస్, ఆచార్య జి.నానాజీ రావు, ఆచార్య ఎస్.రామకృష్ణ, ఆచార్య ఎస్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందు కీర్తనకు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని పుచ్చకాయల ఇందు కీర్తనకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పి.కె.రత్నకుమార్ పర్యవేక్షణలో ×సహదేవి మొక్కపై ఏర్పడే వ్యాధికారక శిలీంద్ర కొలిటో ట్రైకం కొబిటియన్స్‌ను గుర్తించి క్యాన్సర్ నివారణలో ఈ శిలీంద్ర సహాయపడుతుందని తన పరిశోధనలో గుర్తించారు. అదే విధంగా యాంటీబయాటిక్‌గా, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను సైతం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా కీర్తనను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

పరిశోధకురాలికి అభినందన

ఏయూ క్యాంపస్: ఏయూ రసాయన శాస్త్ర విభాగం పరిశోధకురాలు పి.రజిత లక్ష్మిని వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు. ఇటీవల సీఎస్ఐఆర్–ఐఐసీటీలో జరిగిన ఎస్ఐసీటీ–2024 అంతర్జాతీయ సదస్సులో పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో ఆమె బెస్ట్ పోస్టర్ అవార్డుతో పాటు నగదు పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వి.సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేనేతను ప్రోత్సహించండి

ఏయూ క్యాంపస్: చేనేత వస్త్రాలను విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, ఆచార్యులు, విద్యార్థులు ధరిస్తూ ప్రోత్సహించాలని జ్యోతిష్య, వాస్తు పండితుడు లక్కోజు శివరామ కోరారు. సోమవారం ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయాల్లో చేనేత వస్త్రాలను ధరించే విధంగా ప్రోత్సహిస్తే ఎన్నో వేల కుటుంబాలు ఉపాధిని పొందుతాయన్నారు.

అపరిచిత మహిళలతో జాగ్రత్త



ఇందిరానగర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

ఆరిలోవ: కాలనీలో అపరిచితులైన మహిళల పట్ల స్థానికులు అప్రమత్తంగా ఉండాలని ద్వారకా సీఐ శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో సోమవారం సాయంత్రం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల మహిళలు ఎక్కువగా ఇళ్లలోకి చొరబడుతున్నారన్నారు. అపరిచితులైన మహిళలు ఇంటికి వచ్చి ఏమి అడిగినా తొందరపడి ఇవ్వవద్దన్నారు. అలాంటి వారితో పరిచయం పెంచుకోకూడదన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామ్‌దాస్, మురళీకృష్ణ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.